

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి లీలామృతము



## అధ్యాయము - 28

## సజ్జన సన్నుత - మునిజన వందిత సాయిరామ్

**ఆ**త్మజ్ఞానానికి పూర్ణుడైన సద్గురువు యొక్క అనుగ్రహము అవసరము. శ్రీ సాయి చెప్పిన తమ గురుసేవా వృత్తాంతము దీనికి తార్కాణము. కేవలం తమ ఇష్టదేవతనే ఉపాసించిన రామకృష్ణ పరమహంసను తోతాపురియనే జ్ఞానిని ఆశ్రయించమని జగన్మాతయే ఆదేశించింది. శ్రీమన్నారాయణుడు తనను ధ్యానించే రేగేతో సాయిబాబాను ఆశ్రయించమని చెప్పాడు. సప్తశృంగీదేవి తననాశ్రయించిన పూజారితో గూడా అలానే చెప్పింది. అందుకే శ్రీకృష్ణుడు గూడా ముముక్షువులు తత్త్వదర్శియైన మహనీయుని శరణుపొంది సేవించాలని భగవద్గీత 4:34లో చెప్పాడు. ఈ పరమరహస్యాన్నే రమణమహర్షి వంటి మహనీయులు గూడ చెప్పారు.

శ్రీ సాయిబాబా, ప్రపంచంలోని వివిధ మతాలకు చెందిన మహాత్ముల కూటమికి సామ్రాట్టని శ్రీ మెహర్‌బాబా కీర్తించారు. అంతేగాదు, పూర్ణదత్తాత్రేయ స్వరూపియైన శ్రీ అక్కల్కోట మహరాజ్, శ్రీధునీవాలా దాదాగార్లనుండి సామాన్య సాధువుల వరకూ అందరూ తమ రూపాలేనని భక్తులకు అనుభవమిచ్చారు. ఈ కారణంగా వారు సశరీరులై వుండగానే సాయిని ఎందరో మహనీయులు ఎంతగానో కీర్తించారు, గౌరవించారని గుర్తించడమెంతో అవసరం.

ఒకరోజు సాయి అక్కడున్న భక్తులతో అకస్మాత్తుగా, "ఆ దిగంబరి వస్తున్నాడు!" అన్నారు. అదెవరి గురించో భక్తులకు అర్థంగాలేదు. కొద్దిసేపటికి బూటీతో కలసి షేగాం నివాసియైన శ్రీ గజానన్ మహరాజ్ వచ్చారు. ఆయన మశీదు ప్రవేశించక, ముంగిటనే కొద్దిసేపు కూర్చున్నారు. ఒకరు చూచినపుడు ఒకరు చూడకుండా శ్రీసాయి, వారు ఒకరినొకరు మౌనంగా కొంతసేపు చూచుకున్నారు. తర్వాత శ్రీ గజానన్ శిరిడీ వీధులలో కొంతసేపు తిరిగి, తర్వాత వెళ్ళిపోయారు. ఎన్నడూ ఏ మహనీయుల దర్శనానికీ వెళ్ళని శ్రీ గజానన్ శిరిడీ రావడమే, వారు శ్రీసాయికి అర్పించిన జోహర్లు. అలానే శ్రీ ధునీవాలా దాదాగారికి ప్రథమ శిష్యులు, ఆ గురుపీఠానికి వారసులూ అయిన ఛోటేదాదా అను సిద్ధపురుషుడు గూడ సాయి దర్శనానికి కాకా సాహెబ్ దీక్షిత్‌తో కలసి వచ్చారు. అప్పుడు సాయి కన్నులు మూసుకొని మౌనంగా కూర్చున్నారు. వారియెదుట కుడివైపుగా ఛోటేదాదాగారు కొద్దిసేపు ఆయనకేసి మౌనంగా చూస్తూ కూర్చొని, తర్వాత వెళ్ళిపోయారు. మరొకప్పుడు నాసిక్‌నుండి గాడ్గీ మహరాజ్, నాసిక్‌లో వారు నిర్మిస్తున్న 'విశ్వమందిర్' అనే భవన నిర్మాణానికి కావలసిన నిధులు చేకూరని కారణంగా సాయి ఆశీస్సుల కోసం వచ్చారు. వారిని చూస్తూనే సాయి ఎంతో చెడ్డగా తిట్టారు. గాడ్గీ మహరాజ్ అది విని పకపక నవ్వారు. అప్పుడు సాయికూడ నవ్వారు. కొద్దికాలంలోనే తగిన నిధులు వారికి చేకూరాయి. శ్రీ అక్కల్‌కోట స్వామి 1876లో తమ భక్తులను సాయి దర్శనానికి పంపిన వివరం వెనుకటి అధ్యాయంలో చూచాము.

శ్రీసాయికి సమకాలికుడైన సిద్ధపురుషులలో ఒకరు దేవ్‌గాంవ్ నివాసియైన మాధవ్‌నాథ్ మహరాజ్. వీరుగూడ చిలిమ్ త్రాగేవారు. ఈయన ఒకసారి శిరిడీవచ్చి సాయిని దర్శించారు. వారిని చూస్తూనే, "చిలిమ్ త్రాగడం అలాగాదు. అజ్ఞానమనే పొగాకుకు గురుభక్తియనే నిప్పునుపెట్టి చిలిమ్ పీలిస్తే, మనలోని అహంకారం ఆకాశంవలె

అనంతమైన పరమాత్మలోకి ఎగసి లీనమౌతుంది!'' అని శ్రీ మాధవనాథ్ చేతిలో పొగాకు నలిచి పెట్టారు సాయి. ఆయన ఎంతో సంతోషంగా సెలవు తీసికొని వెడుతూ భక్తులతో, ''సాయి సామాన్య సత్పురుషులుగారు, మహనీయులలోకెల్ల కోహినూర్ వజ్రం వంటివారు!'' అన్నారు. తర్వాత సాయి భక్తుడు రేగే 1923లో మాధవనాథ్ మహరాజ్‌ను దర్శించినపుడు ఆయన, ''నీవు సాయి దర్బారులోని వాడవు'' అని చెప్పి, మొదట అతడు సాయిని దర్శించినప్పటి సన్నివేశం వివరంగా వర్ణించి, ''ఆ సమయంలో నేను అక్కడే వున్నాను'' అన్నారు.

పాపక్షయానికి, సద్గురు దర్శనానికి, సద్గురుకృప పొందటానికీ 'శ్రీ గురుచరిత్ర' సాటిలేని సాధనమని కుశాభావుకు సాయి సూచించారు. దాని పారాయణవలన సిద్ధపురుషుడయిన శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామి సాయి సమకాలికులలో ఒకరు. వీరు శ్రీపాద వల్లభస్వామి జన్మస్థానమైన పిఠాపురం దర్శించి, రాజమండ్రిలో కొద్దికాలమున్నారు. అప్పుడు నాందేడ్ నుండి పుండలీకరావు కొందరు భక్తులతో కలసి, వారిని దర్శించాడు. మాటలలో సాయి ప్రసక్తి రాగానే, ఆ స్వామి తలవంచి నమస్కరించి పుండలీకరావుకు ఒక కొబ్బరికాయనిచ్చి, ''దీనిని నా నమస్కారాలతోబాటు మా అన్నగారైన శ్రీ సాయిబాబాకు సమర్పించు; నన్ను మరువక ప్రేమతో కనిపెట్టి వుండమని నా తరపున ప్రార్థించు'' అన్నారు. నాందేడ్ తిరిగివచ్చిన నెలరోజులకు, పుండలీకరావు తన మిత్రులతో కలసి శిరిడీకి బయలుదేరి మన్మాడ్‌లో ఒక కాలువగట్టు చేరాడు. అక్కడ ఆకలి గీర్చుకోడానికి కారపు అటుకులు తిన్నారు. అవి మరీ కారంగా వుండడం వలన ఒక కొబ్బరికాయ కొట్టి అందులో కలుపుకుని తిన్నారు. కాని తర్వాత వారికి గుర్తొచ్చింది - వారు తినేసినది శ్రీ వాసుదేవానంద స్వామి సాయికి పంపిన కొబ్బరికాయ అని! వారు శిరిడీ చేరగానే సాయి, ''నా సోదరుడు పంపిన కొబ్బరికాయ ఏది?'' అని అడిగారు. పుండలీకరావు తన అపరాధం క్షమించమని కోరాడు. ఆ కాయకు బదులుగా మరొక కాయ సమర్పిస్తానన్నాడు. తన సోదరుడు పంపిన కాయకు యింకొకటి సాటికాజాలదని చెప్పి, సాయి ఆ భక్తులను క్షమించి ఆశీర్వదించారు. ఆయన శ్రీ వాసుదేవానందస్వామికి కూడా పూజ్యులే. వారు తమను దర్శించిన సగుణ మేరూనాయక్‌తో, ''నీవు ఒక గొప్ప దర్బారుకు చెందినవాడవు. ఇక నీకు చెప్పవలసినదేమున్నది?'' అని సాయిని ప్రశంసించారు. పరిపూర్ణుడైన యోగికోసం అన్వేషిస్తున్న ఉపాసనీ శాస్త్రితో, రాహురీ నివాసియైన శ్రీ కులకర్ణి అను యోగి, ''మహోన్నతమైన యోగస్థితిలో వున్న నిన్ను ఉద్ధరించగల సమర్థుడు శ్రీ శిరిడీ సాయినాథుడే!'' అని ప్రశంసించాడు. శిరిడీ గ్రామస్థులతో గంగగిర్ బాబా, శ్రీ ఆనందనాథ్ మహరాజ్‌లు సాయిని గురించి ఎంత ప్రశంసగా చెప్పారో చూచాము. ఠాకూర్ అనే ఉద్యోగితో కన్నడ మహాత్ముడు శ్రీ అప్పాకూడా సాయిని గురించి అలానే చెప్పారు గదా! శిరిడిలో 1 సం॥ నివసించిన శ్రీ మెహర్‌బాబాగారు గుస్తావు అనే భక్తునితో, **"సాయిబాబా ఎంత గొప్పవారో తెలుసుకోవటం మీకసాధ్యం. ఆధ్యాత్మిక పూర్ణతే ఆయనగా వెలసింది. ఆయన సంగతి మీకు తెలిస్తే, ఆయన ఈ సృష్టికంతటికీ గురువని తెలుస్తుంది" అన్నారు.**

నాగపూర్ నివాసియైన హజ్రత్ తాజుద్దీన్ బాబాగారి దర్శనానికి బూటీ వెళ్ళినపుడు అతనితో ఆయన, ''ఇక్కడకెందుకొచ్చావు? నీ గురువు శిరిడీలో వున్నారు. నీ విషయంలో జోక్యం చేసుకోవడానికి నేనెవణ్ణి? సాధ్యమైనంత త్వరగా అక్కడికి చేరు'' అన్నారు. తమ దర్శనానికి శిరిడీరాని సాధుపుంగవులకు గూడ వారి వారి స్వస్థలాలలో శ్రీసాయి తమ దర్శనమనుగ్రహించేవారు. ఉదా: 1914లో నాందేడ్ సమీపంలో నివసిస్తున్న దాజీమహరాజ్ గారిని తోసర్ దర్శించాడు. అప్పుడాయన, ''నిన్ననే మారుతి రూపంలో సాయిబాబా యిక్కడకొచ్చారు. అప్పుడు ఉరుమువంటి శబ్దమయింది'' అన్నారు.

మహాసమాధి తర్వాత గూడ శ్రీ సాయి మహనీయులందరికీ సామ్రాట్టుగానే కొనసాగుతున్నారు. వారి చరిత్ర, వారాదేశించిన 'శ్రీ గురు చరిత్ర'లు పారాయణచేసి వారి కృపకు పాత్రులైనవారికి యితర మహనీయుల

కృప అవ్యాజంగా లభిస్తుంది.

దాసగణు 1918లో నాందేడ్ వద్ద తపస్సు చేస్తున్న ఒక బ్రహ్మచారి దర్శనానికి మూడుసార్లు వెళ్ళాడు. ఆయన దర్శనమీయలేదు. దాసగణు ఖిన్నుడై, వేరొకరిద్వారా భిక్ష పంపితే ఆయన తీసుకున్నారు. అతడు సంతోషించి ఆయనను మరలా దర్శించాడు. ఆయన, "నీవు మహనీయుల చరిత్ర వ్రాస్తున్నావు గదా!" అని, అంతకు 6 రోజులముందు దాసగణు వ్రాసిన కీర్తనల గురించి చెప్పి, వాటిలోని కొన్ని వాక్యాలు యథాతథంగా చెప్పి " నీకు సాయి తమ పాదాలనుండి గంగా జలమిచ్చారు గదా, ఏం చేశావు?" అన్నారు. "దానిని శిరస్సున చల్లుకొన్నాను" అన్నాడు దాసగణు. "నీవు సద్బ్రాహ్మణుడవని, సాయి ముస్లిమని, అది త్రాగితే నీవు అపవిత్రుడ వవుతావనీ తలచావుగదూ? ఎంత అహంకారం!" అన్నారు బ్రహ్మచారి.

అలానే దాసగణు ఉస్మానాబాద్‌వద్ద నివసించిన ఇస్లామ్‌పూర్కర్ అనే వృద్ధ బ్రాహ్మణుడైన సాధుపుంగవుని దర్శించి, "శ్రోత్రియుడనైన నేను సాయిని దర్శించవచ్చా?" అన్నాడు. "దర్శించవచ్చు. నేనుగూడ వారిని దర్శించి 3 రోజులు వారి సన్నిధిలో వున్నాను. ఆయనెంతటివారో ప్రజలు తెలుసుకోవడం లేదు. ముందు ముందు వారి గొప్పతనము ప్రజలు తెలుసుకొంటారు" అన్నారు.

దామోదర్ రాస్నే యిలా వ్రాశాడు : "నానాటికీ నాకు సాయి యెడల భక్తి పెరుగుతున్నది. నేను ఇతర మహనీయులను దర్శించినప్పుడు వారిని సాయిబాబా రూపాలుగా తలచి, "సమర్థ సద్గురు సాయినాథునికి నమస్కారము" అనుకొని నమస్కరిస్తాను. నేను 1927లో ఖేడ్‌గాఁవ్‌బేట్ వెళ్ళి శ్రీనారాయణ మహరాజ్‌గారికి నమస్కరించాను. ఆయన, 'నీ గురువు పరమ గురువు. వారు నాకంటే ఎంతో గొప్పవారు, నీవు నా వద్దకు రావడమెందుకు? పూర్వపుణ్యం వలన సాటిలేని గురువునెన్నుకొన్నావు. నీవచ్చటికే వెళ్ళు; 'గమ్యం చేరుతావు' అన్నారు! నేను 1927లో జున్నారు సమీపంలోని సీతారామ్ ఉత్తరేశ్వర్ అనే క్షేత్రం దర్శించి, అక్కడ దేవునికి పువ్వులు సమర్పించి, "సాయిబాబాకు నమస్కారము" అనుకొన్నాను. మరుక్షణమే ఆ విగ్రహము నుండి ఒక దివ్యమైన జ్యోతి వెలువడి, దాని మధ్యలో సాయిబాబా దర్శనము అయింది. అక్కడ నివసిస్తూన్న జానకీదాస్ అనే మహనీయుని దర్శించి వారి రూపంలో వున్న సాయికి నమస్కరించుకొన్నాను. వెంటనే వారు, "నీవెంతో గొప్ప మహనీయుని ఆశ్రయించావు. నావంటి సామాన్య సాధువును దర్శించడమెందుకు? మావంటివారమంతా సాయిబాబా పాదాలనే ఆశ్రయిస్తాము" అన్నారు.

జనార్ధన్ గల్వంకర్ శ్రీ సాయిబాబాను దర్శించినప్పటికీ ఆయనకు సన్నిహితుడు కాలేదు. కాని బాబా మహాసమాధి చెందాక, అతనికి ఆధ్యాత్మిక జీవితంపట్ల, సాయిపట్ల భక్తిశ్రద్ధలు బలపడ్డాయి. అతడు 1921లో సకుటుంబంగా ప్రయాగ వెళ్ళి, అచటి భరద్వాజాశ్రమంలో కూర్చొని, తనకెవరైనా మహనీయుల దర్శనము, ఆశీస్సులూ లభించాలని బాబాను ప్రార్థించాడు. తరువాత ఆశ్రమం విడచి కొంతదూరం పోయాక, ఆ క్షేత్ర దర్శనం చేయిస్తూన్న వ్యక్తి ఒక మహనీయుని అతనికి చూపించాడు. ఆ మహనీయుడు 7 సం॥లకొకసారి ప్రయాగ వస్తుంటాడని, ఎవరికీ దర్శనమివ్వడని, ఎవరినుండీ దక్షిణ స్వీకరించడనీ అతడు చెప్పాడు. గల్వంకర్ మనసులో సాయిని స్మరించి, ఆ మహనీయుని సమీపించాడు. ఎప్పుడూ ఎవరినీ చెంతకు రానీయక కసిరి, బెదరించి వెళ్ళగొట్టే ఆ మహనీయుడెంతో ప్రేమగా చేయెత్తి ఆశీర్వదించి, 'రా! నాయనా, రా!" అని ఆహ్వానించారు. కుటుంబమంతా అతనికి నమస్కరించుకొన్నారు. గల్వంకర్ తన జేబులోనున్న 3 అణాలు దక్షిణగా సమర్పిస్తే ఆయన ఆదరంతో స్వీకరించారు!

అలాగే రేగే అను సాయిభక్తుడు హజ్రత్ తాజుద్దీన్ బాబా దర్శనానికి నాగపూర్ వెళ్ళాడు. ఆ రోజులలో ఆయన రాజుగారి అంతఃపురంలో నివసిస్తూండడం వలన వారి దర్శనం లభించడమెంతో కష్టతరమయ్యేది. దానికితోడు వేలాది జనం రాజభవనానికి ముంగిటనున్న తోటలో వారి దర్శనానికి వేచియున్నారు. నాటి సాయంత్రం 4 గం॥లకు రేగే రైలెక్కవలసి యుండటం వలన మధ్యాహ్నం 3 గం॥ల వరకు మాత్రమే వారి దర్శనం కోసం వేచియుండదలచాడు. ఆ గడువు కొద్ది నిమిషాలు వుండగా ఒక భక్తుడొచ్చి రేగేను శ్రీ తాజుద్దీన్‌బాబా ప్రత్యేకంగా రమ్మన్నారని చెప్పి దర్శనానికి తీసుకు వెళ్ళాడు. రేగే తృప్తిగా వారిని 10 నిమిషాలు దర్శించి, వారి ఆశీస్సులను పొందాడు. కొద్ది కాలం తరువాత శ్రీ శ్రీలలానాథ్ మహరాజ్ ఆ ప్రాంతానికి వచ్చారని తెలిసి, రేగే వారిని గూడా దర్శించి, వారిని తన యింటికి ఆహ్వానించాడు. ఆయన వెంటనే రేగే యిల్లుచేరి సాయి పటానికి నమస్కరించారు. రేగే సమర్పించిన టీ కొంచెం త్రాగి కొంచెం ప్రసాదంగా అతనికిచ్చారు. వేరొకప్పుడు సాయి ఖేడా నివాసియైన శ్రీ కేశవానందజీని, పూణే నివాసియైన హజ్రత్ బాబాజాన్ అనే సిద్ధురాలినీ గూడ దర్శించాడు రేగే. ఆ యిద్దరు మహాత్ములూ అతనిని చూస్తూనే, "నీవు సాయిబాబా దర్బారుకు చెందినవాడవు" అని ఎంతో ఆదరించారు.

గణేష్‌పురీలో శ్రీ నిత్యానందస్వామి శిష్యులు, సిద్ధ పీఠ స్థాపకులూ అయిన శ్రీ ముక్తానంద పరమహంస యిలా వ్రాసారు : "నా సద్గురువైన నిత్యానందులు, సాయిబాబా వేరుగారని నా భావం. నేను మనదేశంలో వున్నప్పుడు ప్రతి సంవత్సరమూ తప్పక శిరిడీ దర్శనమొక్కసారైనా చేస్తాను. ప్రపంచ పర్యటన చేసినపుడు వేలకు వేలు సాయి పటాలు పంచాను."

పూణేలో ఒక కుటుంబం అటు సాయిబాబాకు, యిటు 'కాకా' మహరాజ్‌కూ భక్తులే. ఒకసారి రఘునాథ్ (కాకా) మహరాజ్‌గారిని తమ యింటికి విచ్చేసి కొద్ది రోజులక్కడుండమని కోరారు. కాని ఆయన అంగీకరించలేదు. అపుడు వాళ్ళు సాయిని దర్శిస్తే ఆయన, "చింత పడకండి. కాకా మహరాజ్ మీ యింటికి వస్తారు. ఒక్కరోజుగాదు, మూడు రోజులు మీ యింట్లో వుంటారు!" అని ఆశీర్వదించారు. తర్వాత చిత్రంగా శ్రీ కాకా మహరాజ్ అలానే చేశారు. శ్రీ సాయి ఆజ్ఞ మహనీయులకు గూడ శిరోధార్యమే!

శ్రీ మాధవ్‌నాథ్ మహరాజ్ ఇండోర్‌లో ఎందరినో భక్తిమార్గంలో నడిపించిన మహనీయులు. వీరికి బాబా పట్ల ఎంతో భక్తిశ్రద్ధలుండేవి. బాబాసాహెబ్ రేగే ఒకసారి వీరిని దర్శించి తిరిగి పూణే బయల్దేరుతుంటే ఆయనిలా అన్నారు : "నీవు మొదట శిరిడీ దర్శించి, తర్వాత యింటికి వెళ్ళు, ఈ జాబు బాబాకు యివ్వు". ఆ జాబులో దేవీ సాక్షాత్కారము మొ॥న ఎన్నో విషయాల గురించి ఆయన వ్రాశారు. రేగే శిరిడీ చేరేసరికి అర్ధరాత్రి అవటంవలన సమాధి మందిరం మూసివేశారు. ఏమి చెయ్యాలో తోచక అతడా జాబు ఒక కిటికీలో పెట్టి అక్కడే నిలబడ్డాడు. చిత్రంగా అతడు చూస్తుండగానే అతని కళ్ళ ఎదుటి దృశ్యమంతా మారిపోయింది! అతని ఎదుట బాబా సమాధి వున్నది. దానిపైనున్న దోమతెర తొలగించబడియున్నది. కుడిప్రక్కగా తాను, ఎడమవైపు ఒక పెద్ద పులి వున్నాయి. మరుక్షణమే ఎడమవైపు పులి బదులు దేవీమూర్తి వున్నది. అది చూడగానే మాధవనాథులు జాబులో వ్రాసిన విషయం గుర్తొచ్చింది. దోమతెర లోపల సాయిబాబా చిలిం త్రాగుతూ కూర్చొని వున్నారు. ఆయన ఎదుట మాధవనాథులు కూర్చొని విచిత్రమైన పారవశ్యంతో అటూ యిటూ ఊగిపోతున్నారు. ఈ దృశ్యమెంతోసేపు కొనసాగింది. అది స్వప్నమేమోనని రేగే శంకించాడు గాని, చూచుకుంటే మెలకువే! ఆ జాబుతో మాధవనాథులు సూక్ష్మరూపంలో సాయిని దర్శించారు! సాయి వారి జాబుకు సమాధానంగా దేవీ దర్శనమూ, తమ సాన్నిధ్యానందమూ గూడ వారికి ప్రసాదించారు.

సాయిభక్త యం. రంగాచారి (హైదరాబాదు) యిలా వ్రాస్తున్నారు : "శ్రీ శంభునాథ్‌జీ అను సిద్ధ పురుషుడు

నాతో, 'ముందు ముందు నీవొక సాటిలేని సిద్ధ పురుషుని శరణుపొంది, అంతిమ ఘడియవరకూ ఆయనకంకిత మవుతావు' అన్నారు. అలానే ఒకటి రెండు సం॥లలో నేను బాబాను ఆశ్రయించాను. తర్వాత 1940లో శ్రీ స్వామిరామదాస్ (కన్హన్‌ఘడ్) గారు, 'నిధులన్నింటికీ నిధియనదగిన మహాత్ముని ఆశ్రయించావు. ఎన్నడూ ఆయనను విడువకు' అన్నారు. అలానే 1958 విజయదశమికి పంపిన సందేశంలో శ్రీ స్వామి శివానంద (ఋషీకేశ్), 'శిరిడీ సాయిబాబా అంటే ఆనందసాగరమే, అంత కంటె గొప్పది మరేమున్నది?' అన్నారు. శ్రీ గణపతి సచ్చిదానందగారు యిటీవల నాతో, 'శిరిడీ సాయిబాబా అంటే దత్తాత్రేయుని అవతారమే!' అని, క్షణమాలోచించి, 'కాదు కాదు! వారు దత్తాత్రేయుడే!!' అన్నారు. కొద్ది సం॥ల క్రిందట మద్రాసులో ఒక మాతాజీని దర్శించాను. అప్పుడామె ధ్యానంలో వున్నారు. పావుగంట తర్వాత ఆమె 'శిరిడీ సాయిబాబా!' అని నాకేసి చూచి, 'త్రేతాయుగంలో వశిష్ఠ మహర్షిగాను, ద్వాపరంలో దత్తాత్రేయుడుగానూ అవతరించినదే, కలియుగంలో శిరిడీ సాయిబాబాగా వచ్చింది! ఇప్పుడు శివ, రామ మందిరాలున్నట్లే, ఒకటి రెండు శతాబ్దాలలో ప్రతి గ్రామంలోనూ సాయి మందిరాలు వెలుస్తాయి. అవి మన గ్రామీణ జీవితమంతటికీ కేంద్రాలవుతాయి' అన్నారు.

ఒకసారి, సమాధి చెందిన సిద్ధపురుషులు జ్ఞానమివ్వలేరని విన్నాను. నేను పూణే వెళ్ళినపుడు శ్రీ వాసుదేవానంద స్వామికి ప్రత్యక్ష శిష్యులైన శ్రీ గుళవణి మహరాజ్ అనే యోగి, "సాయిబాబా కా బేటా! శ్రీ సాయి విషయమలాగాదు. ఆయన దత్తావతారమే గాని కేవలం సిద్ధపురుషుడుగారు! సమాధి చెందాక గూడ వారెందరికో శరీరంతో దర్శనమిచ్చి ఉద్ధరిస్తున్నారు. నీవు నడుస్తున్న బాట ఎంతో మంచిది. ఆ మర్గాన్నే పో!" అన్నారు. కాళహస్తిలో నివసించిన అవధూత గోపాలస్వామి, "సాయి భగవాన్ హై!" అన్నారు.

సాయి యింతటి మహనీయులు గాబట్టే భగవదాదేశంగా ఆ పేరు ఆయనకు సార్థకంగా నిలిచింది. 'సాయి' అంటే 'మహాత్ములలో శ్రేష్ఠుడు' అని బెంగాల్ రాష్ట్రంలో వాడుక. ఆ పేరుకు 'సర్వానికీ అతీతుడు' అని అర్థమని శ్రీ రామకృష్ణ పరమహంస చెప్పారు. (వచనామృతము, ii, 55). ఒకనాడు పరమహంస, తమకు చిలిం పీలుస్తున్న మహాత్ముని చిత్రపట మొకటి, ధుని నిర్వహించే మహనీయుని పటమొకటీ కావాలని కోరి, "వాటిని చూడటంవలన తీవ్రమైన భక్తి కలుగుతుంది" అన్నారు. ఎప్పుడూ చిలిం పీల్చేవారు షేగాం నివాసి శ్రీ గజానన్ మహరాజ్; నిరంతరమూ ధుని నిర్వహించినది, చిలిం త్రాగినదీ శ్రీ సాయిబాబా.

★★★

